సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



ఆ సీటు మాదే..మీరు దిగిపోండి

పార్టీ మాదే.. ప్రభుత్వం మాదే.. మేము ఏమి చెప్పినా శిరసావహించాల్సిందే.. అంటూ అధికార పార్టీ నేతలు ఏకపక్ష వైఖరి అమలుచేస్తున్నారు. -8లో



అండర్-19 టోర్నీలో బౌలర్ల హవా

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో బౌలర్ల హవా నడుస్తోంది. -8లో

గరిష్టం/కనిష్టం
36.2/26.8

వాతావరణం

జిల్లాలో గురువారం 26.8 – 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటి నుంచి మిరప సాగుపై శిక్షణ



మైదుకూరు: మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్ర, శనివారాల్లో మిరప పంట సాగుపై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మిరప సాగు యాజమాన్యం, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని మిరప రైతులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

8న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



మైదుకూరు: మైదుకూరులో ఈనెల 8న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు వర్ధంతి సందర్భంగా ఆయన స్మారకార్థం ఈ ప్రదర్శన ఉంటుందని వారు పేర్కొన్నారు. మైదుకూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ ప్రదర్శనలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్ల నుంచి ఒక్కో ప్రాజెక్టును అనుమతిస్తామని తెలిపారు. ఎంపికైన ప్రాజెక్టులకు నగదు బహుమతితోపాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందిస్తామని వివరించారు. ఈనెల 5వ తేదీలోపు తమ పేర్లను నమో దు చేసుకోవాలన్నారు. వివరాలకు మూర్తి వెంకటేశ్వర్లు 9848421002, వేపరాల వెనిజర్ ఇమ్మానుయేల్ 8328375357, కొప్పరపు గుణవర్ధన్ 9381441900 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆర్డీగా డాక్టర్ శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



ఆర్డీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 ఇన్‌చార్జ్ రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ వై. శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఉద్యోగుల ప్రయోజనాల కోసం చర్యలు చేపడుతామని అన్నారు. ఈ సందర్భంగా ఆ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, వెంకట సుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్స్ అతావుల్లా, బత్తనయ్య, వనీష, రవి, చంద్ర, కరుణాకర్, విశాల్, రాజశేఖర్ తదితరులు ఆర్డీకి శుభాకాంక్షలు తెలిపారు.

సీఐ బదిలీ

కడప అర్బన్: ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐగా పనిచేస్తున్న ఎం. శ్రీకాంత్ యాదవ్ అనంతపురం టూటౌన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షేముషి ఉత్తర్వులు జారీ చేశారు.

4న జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలబాలికల జట్టు ఎంపిక



రాయచోటి (జగదాంబసెంటర్): ఈ నెల 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌కు ఉమ్మడి కడప జిల్లా బాల బాలికల జట్టును ఎంపిక చేయనున్నారు. ఈనెల 4న రాయచోటిలోని మాసాపేట జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపిక ప్రక్రియ జరుగుతుందని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జేసునాథ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, సెలెక్షన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీశ్వరయ్య, మనోహర్‌రెడ్డి తెలిపారు. 2007వ సంవత్సరం జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని సూచించారు.

ఈ పంట.. ఉన్నట్టా.. లేనట్టా!

అన్నదాతల సంక్షేమంపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైంది. 'అన్నదాత సుఖీభవ' నిధులా ఇంకా ఇవ్వలేదు.. అప్పోసప్పో చేసి పంట సాగు చేస్తే ఈ క్రాప్ నమోదూ చేయలేదు. ' పంట సాగుకు నీళ్లివ్వరు.. నిధులివ్వరు.. కనీసం.. 'ఈ పంట' నమోదు కూడా చేయకుంటే ఎలాగని మండిపడుతున్నారు. అనుకోని విపత్తు జరిగితే ప్రభుత్వ రాయితీలకు.. పంట పరిహారాలకు.. 'ఈ పంట..ఉన్నట్టా.. లేనట్టా' అంటూ రైతులు కలవరపడుతున్నారు.

- ఆగస్ట్ నెల ప్రారంభమైనా మొదలుకాని పంట నమోదు
- రైతుల్లో ఆందోళన



ఈ క్రాపు నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

కడప అగ్రికల్చర్: జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. జిల్లావ్యాప్తంగా 75,189 హెక్టార్లలో సాధారణ సాగుకాగా.. ఇప్పటికే 17,120 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. ఇక కేసీ నీరు విడుదలైతే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏటా పంటలసాగు సమయంలో వ్యవసాయశాఖ సిబ్బంది పంట పొలాల వద్దకు వెళ్లి ఈ క్రాపు నమోదు చేసేవారు. ఫలితంగా ప్రభుత్వ రాయితీలు, విపత్తుల సమయంలో పరిహారం, పంట దిగుబడుల అమ్మకాల సమయంలో ఇబ్బంది ఉండదన్న ధీమా రైతుల్లో ఉండేది. ప్రస్తుత ప్రభుత్వంలో ఈ క్రాప్ నమోదు ఇంకా మొదలు కాకపోవడంతో రైతుల్లో కలవరం మొదలైంది.

- ఈ క్రాపు నమోదుకు సంబంధించి విధి విధానాలు వచ్చినా దానికి సంబంధించిన మొబైల్ యాప్ రాలేదని సమాచారం. దీంతో ఈ క్రాపు నమోదు ఇంకా ఆలస్యం కానున్నట్లు సమాచారం. దీంతోపాటు వెబ్‌ల్యాండ్ డేటాను కూడా మండల వ్యవసాయ అధికారులు డౌన్‌లోడ్ చేసుకునే పనిలో ఉన్నట్లు తెలిసింది. ఈ క్రాపు సకాలంలో నమోదు కాకుంటే ప్రభుత్వ రాయితీలు, విపత్తుల సమయంలో పరిహారం, పంట దిగుబడుల అమ్మకాల సమయంలో ఇబ్బందులు తప్పవని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులను సకాలంలో అందించి వ్యవసాయ అభివృద్ధికి తోడ్పాటునందించింది. దీంతోపాటు ఈ క్రాపు నమోదు ద్వారా పంటలసాగుకు ఎరువులు, పంట అమ్మకాలు, పంటల నష్టం జరిగినప్పుడు పంటల బీమాకు ఈ క్రాపు ఆధారంగా డబ్బులు చెల్లించేవారు.

▶▶ ప్రయోజనాలు ఇలా..

రైతులు సాగు చేసిన పంటను ఈ క్రాపు చేయడం వల్ల పంటల బీమా వర్తిస్తుంది. పంట రుణాలు మంజూరు అవుతాయి. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతింటే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల నష్టపరిహారం అందుతుంది. పండించిన పంటల దిగుబడులను మద్దతు ధరతో విక్రయించుకోవచ్చు. ఇదంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2023 వరకు ఈ క్రాపు ఆధారంగానే ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా రైతులకు పథకాలను వర్తింప చేసింది. పైగా ఈ క్రాపు నమోదులో పారదర్శకత చూపించింది.

17, 120 హెక్టార్లలో పలు పంటలు సాగు...

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాధారణ సాగు 75,189 హెక్టార్లుకాగా గత నెల 27వ తేదీ నాటికి 17120 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో 3259 హెక్టార్లలో వరి, 849 హెక్టార్లలో మొక్కజొన్న, 430 హెక్టార్లలో కొర్ర, 432 హెక్టార్లలో కంది, 3247 హెక్టార్లలో మినుము, 2344 హెక్టార్లలో వేరుశగన, 156 హెక్టార్లలో ఆముదం, 258 హెక్టార్లలో సోయాబీన్, 5722 హెక్టార్లలో పత్తి పంటలు సాగయ్యాయి.

గతేడాది 38 వేలు నష్టపరిహారం వచ్చింది..



గతేడాది వరి నాటి సకాలంలో ఈ క్రాపు నమోదు చేయించా. తరువాత అధిక వర్షాలతో వరి పంట దెబ్బతింది. ఈ క్రాపు సకాలంలో చేయడం వల్ల నాకు ఎకరాకు రూ. 19 వేల చొప్పున రెండు ఎకరాలకు రూ. 38 వేలు నష్ట పరిహారం వచ్చింది. ఈసారేమో ఇంకా మొదలే పెట్టలేదు. – వీరమోహన్, మాచనపల్లె, దువ్వూరు మండలం

ఇన్‌పుట్, ఇన్సూ్యరెన్స్ రెండు వచ్చాయి..



రెండేళ్ల క్రితం సాగు చేసిన శనగపంట అధిక వర్షాలకు దెబ్బతినంది. పంటను దున్నేశాను. ఈ క్రాపు చేయడం వల్ల నాకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఎకరాకు 4 వేల చొప్పున 5 ఎకరాలకు రూ. 40 వేలు వచ్చింది. అలాగే మరోమారు అదే శనగపంట వర్షాలు లేక దెబ్బతింటే అప్పుడు కూడా ఇన్సూ్యరెన్స్ కింద 7 ఎకరాలకు రూ. 70 వేలు వచ్చింది. సకాలంలో ఈ క్రాప్ నమోదు చేయాలి – ప్రతాప్‌రెడ్డి, పగిడాల, రాజుపాలెం

తక్షణం ఈ క్రాపు చేయాలి...



ఖరీప్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచిపోయి మూడో నెల పడింది. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొ న్నాయి. అరకొర వర్షానికి చాలా చోట్ల ఆరుతడి పంటలు ఎండిపోతున్నాయి. కొన్ని చోట్ల పంటలను దున్నేస్తున్నారు. కానీ వ్యవసాయ అధికారులు ఇంతవరకు క్షేత్రస్థాయిలో ఈ క్రాపు నమోదు చేయలేదు. దీని వల్ల రైతులు నష్టపోతారు. అధికారులు స్పందించి ఈ క్రాపు నమో దు చేయాలి.
– దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

త్వరలో ప్రారంభిస్తాం



ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ క్రాపు నమోదుకు ప్రభుత్వం నుంచి విధివిధానాలు వచ్చాయి. దీంతోపాటు వెబ్‌ల్యాండ్ డేటాను వ్యవసాయ అధికారులు డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. వీఏఏలకు మొబైల్ యాప్ రావాల్సి ఉంది. త్వరలో ఈ క్రాపు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. – అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

ప్రొటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్ ఫిర్యాదు చేస్తున్న పాలక మండలి చైర్మన్ కావలి కృష్ణతేజ

వేంపల్లె/చక్రాయపేట: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య ప్రొటోకాల్ ఉల్లంఘించారని పాలక మండలి చైర్మన్ కావలి కృష్ణతేజ ఆరోపించారు. ఈ మేరకు గురువార జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శివశంకర్‌కు వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. శ్రావణమాసం ఉత్సవాలకు సంబంధించి ప్రచారగోడ పత్రాల్లో, ఆహ్వానపత్రికల్లో దేవస్థానం పాలక మండలి చైర్మన్, సభ్యుల వివరాల ప్రస్తావన లేకపోవడం అవమానకరమని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత దశాబ్దాల కాలం నుంచి ఇంతవరకు ఇలాంటి తప్పు జరగలేదని తెలిపారు. గతంలో ఏప్రభుత్వం అధికారంలో ఉన్నా పాలక మండలి చైర్మన్ తోపాటు సభ్యుల పేర్లను ఆహ్వాన పత్రికల్లో ముద్రించేవారని తెలిపారు. వైభవంగా జరిగే ఈ ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంటే అందుకు పాలక మండలి సభ్యులుగా బాధ్యత వహించాల్సి వస్తుందని, ఇలాంటి పరిస్థితుల్లో కేవలం గండి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ నిర్వహణలో జరుగుతున్నట్లు ఆహ్వాన, గోడ పత్రాల్లో ప్రచారం చేయడం శోచనీయమన్నారు. ఈ విషయంపై అసిస్టెంట్ కమిషనర్‌ను వివరాలు అడుగగా సమాధానం చెప్పకపోవడం బాధాకరమన్నారు. దీనిపై వివిధ వర్గాల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయని కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే వాల్ పోస్టర్లు పల్లెల్లో అంటించారని ఇప్పుడు విమర్శలు రావడంతో కంటితుడుపు చర్యల్లో భాగంగా ముఖ్యలకు ఇచ్చేందుకు తప్పులు సవరించి ఆహ్వాన పత్రికలు ముద్రించారని ఆవేదన వ్యక్తం చేశారు. గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్యపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కేసీ కెనాల్‌కు నీరు విడుదల



కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

వల్లూరు: ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద నుంచి కేసీ కెనాల్‌కు గురువారం నీరు విడుదల చేశారు. అర్చకుల పూజల అనంతరం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్య రెడ్డి గేట్లు ఎత్తి కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటి వరకు వర్షాలు తక్కువగా కురిసినప్పటికీ కేసీ కెనాల్‌కు ఆగస్టు 1 వ తేదీనే నీటిని విడుదల చేశామని పేర్కొన్నారు. ప్రతి ఎకరాలకు నీటిని అందించాలనేదే సీఎం ధ్యేయమని అన్నారు. ఈ కాలువ ద్వారా కమలాపురం నియోజకవర్గంలో 9 వేల ఎకరాలకు, కడప నియోజకవర్గంలో 4,800 ఎకరాలకు, దేవుని కడప చెరువుకు నీరు అందుతుందని అన్నారు. సర్వరాయ సాగర్ పనులను పూర్తి చేసి నియోజకవర్గంలో 80 వేల ఎకరాలకు నీటిని అందిస్తానని సీఎం హామీ ఇచ్చారని అన్నారు. ఎంపీడీవో విజయ భాస్కర్, ఇరిగేషన్ , రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కవచ్‌తో రైళ్ల ఢీకి చెక్

- ముంబై–చెన్నై రైలు మార్గంలో కవచ్‌కు ప్రతిపాదన
- 523 కి.మీ. దూరం ఏర్పాటు

రాజంపేట: రైలు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని గుంతకల్–కడప–నందలూరు–రేణిగుంట మీదుగా ఉన్న రైల్వేలైనులో 'కవచ్' వ్య వస్థ ఏర్పాటు కానుంది. ఈమేరకు సంబంధిత సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ డిపార్టుమెంట్ (దక్షిణ మధ్య రైల్వే) నుంచి ప్రతిపాదన రైల్వే మంత్రిత్వ శాఖకు వెళ్లింది. ప్రధానంగా కవచ్ అనేది ఒకే లైనుపై రైళ్లు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఢీ కొనకుండా ముందస్తుగా ప్రమాదాన్ని పసిగట్టి నివారించే వ్యవస్థ కలిగి ఉంటుంది. అందువల్ల ఈ మార్గంలో రైళ్ల ఢీకి చెక్ పెట్టేందుకు కవచ్ వ్యవస్థను తీసుకు రానున్నారు. ఇప్పటికే దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో సికింద్రాబాద్ నుంచి వాడి మార్గంలో ఈ పద్ధతిని అనుసరిస్తున్నారు.

అనంతపురం, ఉమ్మడి కడప, తిరుపతి జిల్లాల్లో..

ప్రస్తుతానికి నాల్వార్–గుంతకల్–నందలూరు–రేణిగుంట (ముంబై–చెన్నై మార్గం)లో ఈ కవచ్ పద్ధతిని తీసుకురావడానికి అధికారులు ప్రతిపాదనలు చేశారు. నాల్వార్ కర్ణాటక రాష్ట్రంలో ఉన్నప్పటికి, అధిక మొత్తం రాయలసీమ రైలు మార్గంలోనే కవచ్ ఉండనుంది. అనంతపురం, కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల పరిధిలో రైలు మార్గాన్ని కవచ్ వ్యవస్థకు ఎంపిక చేసే ప్రతిపాదనలకు త్వరలో రైల్వేబోర్డు ఆమోదం తెలపాల్సి ఉంది.

523 కి.మీ మేర రైలుమార్గానికి రూ.90 కోట్లు

దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదన మేరకు 523 కిలోమీటర్ల మేర రైలుమార్గాన్ని కవచ్ సాంకేతిక వ్యవస్థ కిందకు తీసుకురానున్నారు. ఇందుకోసం నిర్మాణ వ్యయం రూ.90 కోట్ల మేర ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు రైల్వే వర్గాల సమాచారం. ఈ వ్యవస్థ అమలైతే రైళ్ల ఢీకి చెక్ పెట్టవచ్చని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి.

తల్లిపాలు బిడ్డకు అమృతం

కలెక్టర్ శివశంకర్




తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: తల్లిపాలు బిడ్డకు అమృతాహారం.. ప్రపంచంలో నేటివరకు తల్లిపాలకు ప్రత్యామ్నాయం ఏదీ లేదని శిశువు ఆరోగ్యంగా ఎదగడంలో తల్లిపాలు కీలకపాత్ర పోషిస్తాయని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. గురువారం కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లోని నవజాత శిశు విభాగంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ శివశంకర్ లోతేటి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్తులో మంచి సామాజిక వనరుగా మన పిల్లలు తీర్చిదిద్దాలంటే ఆరోగ్యకరమైన, బలవర్ధక ఆహార విలువలున్న తల్లిపాలను ప్రతి తల్లి పుట్టిన పిల్లలకు ఇవ్వాలని తల్లులకు వివరించారు. పాలు ఇవ్వడంతో తల్లీబిడ్డ మధ్య అనుబంధం పెనవేసుకుంటుందని.. ఈ వారోత్సవాల్లో తల్లిపాల విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా దిల్షాద్ అనే బాలింత మాట్లాడుతూ తల్లిపాలను మించిన తొలి పోషకాహారం ప్రపంచంలో ఏదీ లేదనీ మొట్టమొదటగా బిడ్డకు తల్లి పాలు పట్టడంలో తల్లి అని భావించే అనుభూతి అతి మధురమైనదిగా తెలిపారు. అనంతరం తల్లిపాల వారోత్సవాలపై ప్రచురించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఆర్డీఓ వెంకటపతి, ఏపీవీవీసీ ఇన్‌ఛార్జ్ ఆర్డీ, రిమ్స్ సీఎస్ఆర్ఎంఓ వై. శ్రీనివాసులు, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డీఎంహెచ్ఓ నాగరాజు, కడప రిమ్స్ ప్రిన్సిపాల్ ఏ. సురేఖ, జీజీహెచ్ సూపరింటెండెంట్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం. సురేశ్వర్ రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ మాధురీలత, పీడియాట్రిక్ వైద్యులు వంశీ పాల్గొన్నారు.

జిల్లా ప్రగతికి బ్యాంకర్లు సహకరించాలి

జిల్లా ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ శివశంకర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ లెవెల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని బ్యాంకులు తమకు నిర్దేశించిన వివిధ రకాల రుణాల లక్ష్యాలను సాధించాలని కోరారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి 129.75 శాతం లక్ష్యాలను సాధించడం అభినందనీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. లబ్ధిదారులకు పెండింగ్ లేకుండా రుణా లు అందించాలని చెప్పారు. గ్రామ సచివాలయా ల పరిధిలో బ్యాంకింగ్ సేవలు విస్తృతం కావాలన్నారు. స్టాండప్ ఇండియా, ముద్ర, గ్రామీణ ఖాదీ బోర్డు వంటి ప్రభుత్వ పథకాలతో పాటు పంట రుణాలు, విద్యా రుణాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. చేనేత, మత్స్యకారులకు రుణాలు అందించి ఆర్థిక చేయూతనివ్వాలని సూచించా రు. ప్రభుత్వం విడుదల చేసిన రూ. 10 నాణేలను మార్కెట్‌లో సులభంగా చలామణి అయ్యేలా వ్యాపారులకు అవగాహన పెంచాలని సూచించారు. పీఎం కిసాన్ లబ్ధిదారులకు కేసీసీ మంజూరుకు సంబంధించి ప్రత్యేక క్యాంపులను నిర్వ హించాలన్నారు. కార్యక్రమానికి ముందు ఎల్‌డీఎం జనార్దన్, డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ సమావేశాలకు సంబంధించిన అజెండా వివరాలు, రుణాల ప్రగతిని గురించి వివరించారు.

▶▶ జిల్లాలో ఉపాధి అవకాశాలు పుష్కలం



ఉద్యోగి పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కొప్పర్తి పారిశ్రామిక వాడలో నూతన పరిశ్రమల ఆవిర్భావంతోపాటు ఉత్పత్తులు కూడా ప్రారంభం అయ్యాయని, జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కొదవ లేదని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కొప్పర్తిలోని 540 ఎకరాల్లో ఏర్పాటైన మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ను కలెక్టర్ జేసీ అదితి సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఎంసీలో రెండు లక్షల చదరపు అడుగుల్లో ఏపీఐఐసి వారు నిర్మించిన షెడ్లలో 'అల్ డిక్సన్ కంపెనీ' సీపీ ప్లస్ సంస్థ నిర్వహణలో సీసీ కెమెరాలు, ఇతర ఏఐ, సైబర్ సెక్యూరిటీ సిస్టమ్స్ ఉత్పత్తులను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మంచి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆ దిశగా కొప్పర్తి పారిశ్రామిక వాడను.. రాష్ట్రంలోనే మోడల్ ఇండస్ట్రియల్ పార్కుగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్, జేసీలు అల్ డిక్సన్ ఆవరణలో పచ్చదనం – పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ నినాద స్ఫూర్తితో మొక్కలు నాటారు. అనంతరం వారు ఈఎంసీ క్లస్టర్‌లోని అన్ని ప్రాంతాల్లో కలియతిరిగి అక్కడ జరుగుతున్న ఇతర అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. కడప ఆర్డీవో వెంకటపతి, ఏపీ ఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ ఉదయ్ కుమార్, ఇండస్ట్రియల్ జీఎం జయలక్ష్మి, అల్ డిక్సన్ జీఎం రాజీవ్ షైనీ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు పోస్టింగులు

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జోన్–4 పరిధిలోని ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లి తిరిగి వచ్చిన తహసీల్దార్లకు కలెక్టర్ శివశంకర్ గురువారం రాత్రి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇప్పటివరకు డిప్యూటీ తహసీల్దార్లు ఆయా మండలాల్లో ఇన్‌ఛార్జిలుగా ఉంటున్నారు. కాగా తహసీల్దార్లు తక్షణమే పోస్టింగ్ ఇచ్చిన మండలాలకు వెళ్లి ఆయా డీటీల నుంచి చార్జ్ తీసుకోవాలని కలెక్టర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మండలం	తహసీల్దార్ పేరు
బద్వేలు రెవెన్యూ డివిజన్	
మైదుకూరు	వి.రాజసింహా నరేంద్ర
కాశినాయన	ఎం.బాలనరసింహులు
కలసపాడు	డి.మహబూబ్‌బాష
పోరుమామిళ్ల	ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి
బి.కోడూరు	పీఎండీ అలీఖాన్
బద్వేలు	డి.ఉదయభాస్కర్‌రాజు
గోపవరం	వై.ఉదయభారతి
బి.మఠం	డి.దామోదర్‌రెడ్డి
అట్లూరు	బి.సువర్ణదేవి
బద్వేలు ఆర్డీఓ ఆఫీసు ఏఓ	సి.అక్బర్‌బాష
జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్	
జమ్మలమడుగు	పి.శ్రీనివాసరెడ్డి
పెద్దముడియం	వి.వెంకట సుబ్బయ్య
మైలవరం	ఎం.లక్ష్మీనారాయణ
ముద్దనూరు	పి.రామకుమారి
కొండాపురం	కె.మాధవకృష్ణారెడ్డి
ప్రొద్దుటూరు	వి.గంగయ్య
రాజుపాలెం	జి.వెంకటేశ్వర్లు
దువ్వూరు	జీవీ మధురవాణి
చాపాడు	జి.రవీంద్రారెడ్డి
ఎర్రగుంట్ల	కె.శోభన్‌బాబు
జమ్మలమడుగు ఆర్డీఓ ఆఫీసు ఏఓ	డి.తిరుపతయ్య

కడప రెవెన్యూ డివిజన్	
కడప	ఎంవీఎస్ నారాయణరెడ్డి
కమలాపురం	బి.శివరామిరెడ్డి
వల్లూరు	ఎం.శ్రీవాణి
చెన్నూరు	ఆర్.జీవన్ చంద్రశేఖర్
సీకే దిన్నె	ఎ.నాగేశ్వరరావు
పెండ్లిమర్రి	బి.అనూరాధ
ఒంటిమిట్ట	ఏవీ రమణమ్మ
ఖాజీపేట	టి.సరస్వతి
కడప ఆర్డీఓ ఆఫీసు ఏఓ	పి.శంకర్‌రావు
కడప ఆర్డీఓ ఆఫీసు కేఆర్‌ఆర్‌సీ	ఎస్.బ్రహ్మజమ
కడప అర్బన్	ఆర్.శేషారాం సింగ్
పులివెందుల రెవెన్యూ డివిజన్	
సింహాద్రిపురం	బి.గురప్ప
లింగాల	టి.ఈశ్వరయ్య
తొండూరు	బి.రామచంద్రుడు
పులివెందుల	ఏఎస్ నజీర్ అహ్మద్
వేముల	ఎం.ఇందిరారాణి
వేంపల్లె	వై.హరినాథరెడ్డి
చక్రాయపేట	పి.విజయకుమారి
వీఎన్ పల్లె	బి.లక్ష్మీదేవి
పులివెందుల ఆర్డీఓ ఆఫీసు ఏఓ	ఎంఏ రమేష్



కలెక్టరేట్	
కలెక్టరేట్ సూపరింటెండెంట్ (ల్యాండ్స్)	ఇ.ప్రతాప్‌రెడ్డి
కలెక్టరేట్ సూపరింటెండెంట్ (కో ఆర్డినేషన్)	టి.వెంకట రమణ
కలెక్టరేట్ సూపరింటెండెంట్ (మెజిస్ట్రీరియల్)	ఎం.వెంకట స్వామి
స్పెషల్ తహసీల్దార్ ల్యాండ్ రీఫామ్స్ (పీజీ ఆర్ఎస్)	జీవీ నాగేశ్వరరావు
అడిషనల్ తహసీల్దార్ ల్యాండ్ రీఫామ్స్	పి.శరత్ (కలెక్టర్ పీఎస్)
తహసీల్దార్ (ఎస్‌డబ్ల్యుఎల్‌పి)	పి.భారతి

క్లుప్తంగా

రైలు కింద పడి వ్యక్తి మృతి

కొండాపురం : మండలంలోని రేగడిపల్లె–వంగనూరు మధ్య రైలు కిందపడి చామల రంగారెడ్డి (42) మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. రైల్వే ఎస్ఐ వివరాల మేరకు.. కొండాపురం మండలం దత్తాపురం గ్రామానికి చెందిన చామల రంగారెడ్డి బుధవారం బహిర్భూమికి వెళ్లి వస్తున్నారు. ఆ సమయంలో గుర్తుతెలియని రైలు ఢీకొట్టడంతో ట్రాక్ ప్రక్కన పడి చనిపోయారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గుత్తి ఎస్ఎంఆర్ సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తల దాడి

పులివెందుల రూరల్ : వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలోని రింగురోడ్డు సమీపంలో ఉన్న న్యాక్ బిల్డింగ్ వద్ద బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మహమ్మద్, ప్రకాష్‌లపై టీడీపీకి చెందిన సుమంత్, రాహుల్, తేజా, ఫయాజ్, శ్రీనులు దాడి చేశారు. గతంలో కూడా టీడీపీకి చెందిన ఇదే వ్యక్తులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేసి గాయపరిచారు. పాతకక్షలతో టీడీపీ కార్యకర్తలు దాడి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తెలిపారు. బుధవారం రాత్రి ఇంటి దగ్గరకు వచ్చి ఇంటిలోని వంటసామాగ్రిని పగులగొట్టి దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తప్పిన ప్రమాదం..



ట్రాన్స్‌ఫార్మర్‌కు వ్యాపిస్తున్న మంటలు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అగ్ని ప్రమాదం తలెత్తింది. ట్రాన్స్‌ఫార్మర్ పేలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గురువారం సాయంత్రం ప్రభుత్వ ఆసుపత్రి ప్రక్కన కొలిమి బంకు నుంచి నిప్పు రవ్వలు పడడంతో చెత్త చెదారానికి నిప్పు అంటుకుంది. మంటలు ప్రక్కనే ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్‌కు చేరడంతో ట్రాన్స్‌కో అధికారులు సరఫరా వెంటనే నిలిపివేశారు. అగ్నిమాపక శాఖ అధికారులు చేరుకుని మంటలను అదుపు చేశారు.

మర్రిబండలో చిరుత కలకలం..!

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె మండలం ముష్టూరు పంచాయతీ మర్రిబండ సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన రైతు శ్రీరాములు తెలిపిన మేరకు వివరాల మేరకు.. మర్రిబండ గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతం వద్ద శ్రీరాములు వరి పంట సాగు చేశాడు. దీంతోపాటు కోళ్లు, మేకలు, పశువులు పెంచుతున్నాడు. తెల్లవారుజామున కుక్క అరవడంతో శ్రీరాములు బయటకు వెళ్లి చూశారు. ఓ లేగ దూడ, మేకపోతుపై క్రూర జంతువు దాడి చేసిందని, కుక్క అరవడంతో వెనుదిరిగిందని గుర్తించారు. చిరుత దాడి చేసి ఉంటుందని భావించి శ్రీరాములు రెవెన్యూ, పోలీస్, ఫారెస్ట్ అధికారులకు తెలిపారు. వాల్మీకిపురం అటవీ సెక్షన్ అధికారి సుధాకర్, నూరుకుప్పలకొండ బీట్ ఆఫీసర్ శోభారాణి, సిబ్బంది చేరుకొని జంతువు ఆనవాళ్ల కోసం వెతికారు. చిరుత దాడి చేసినట్లు ఆనవాళ్లు లేవని, తోడేలు లేక హైనా దాడిచేసి ఉండవచ్చని అధికారులు తెలిపారు. పశువులను, మేకలను రాత్రి వేళల్లో ఉంచవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో, ఏబీఓ హరి శంకర్‌రెడ్డి, ఏఎస్ఐ జిలానీ బాషా, వీఆర్వో నాగేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

ఆ సీటు మాదే.. మీరు దిగిపోండి

పార్టీ మాదే.. ప్రభుత్వం మాదే.. మేము ఏమి చెప్పినా శిరసావహించాల్సిందే.. అంటూ అధికార పార్టీ నేతలు ఏకపక్ష వైఖరి అమలుచేస్తున్నారు. ఇప్పటికే సంక్షేమ కమిటీలకు వైకాపా ప్రభుత్వం నియమించిన నేతలచే రాజీనామా చేయించిన బాబు అనుచరులు ఇపుడు ప్రొద్దుటూరు కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ స్థానం మాదే.. మీరు దిగిపోండి అంటూ పట్టుబట్టారు. చైర్మన్‌ను బెదిరించి ఒత్తిడి పెంచుతున్నారు.

- టౌన్ బ్యాంకు కమిటీపై టీడీపీ నేతల ఏకపక్ష వైఖరి
- రాజీనామా చేయాలంటూ చైర్మన్ కుమార్‌రెడ్డిపై ఒత్తిడి



ప్రొద్దుటూరులోని ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్

ప్రొద్దుటూరు : పదవీ కాలం ఉన్నా.. ముందుగానే రాజీనామా చేయాలంటూ అధికార పార్టీ నేతలు రుబాబు చేస్తున్నారు. తాజాగా ప్రొద్దుటూరు కో ఆపరేటివ్ బ్యాంకు ప్రస్తుత చైర్మన్ యెల్లాల కుమార్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలంటూ ఒత్తిడి చేశారు. గత 103 ఏళ్ల టౌన్ బ్యాంక్ చరిత్రలో ఈ పరిస్థితి ఎన్నడూ చోటుచేసుకోలేదు. గతంలో కాకర్ల లింగారెడ్డి ఎక్కువ సంవత్సరాలు బ్యాంకు చైర్మన్‌గా పనిచేయగా, ప్రస్తుతం నాలుగో మారు వరుసగా కుమార్‌రెడ్డి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. 32 ఏళ్ల పాటు బ్యాంకు డైరెక్టర్‌గా పని చేసిన ఈయన గత 17 ఏళ్లుగా చైర్మన్‌గా ఎన్నికవుతూ వస్తున్నారు. బ్యాంకుకు మొత్తం 12 మంది డైరెక్టర్లు ఉండగా.. స్థానికంగా ఏ నాయకుడి అనుచరుడుగా ఉన్నా బ్యాంకులో రాజకీయాలకు తావు లేకుండా కుమార్ రెడ్డి పనిచేస్తున్నారు. ఖాతా దారుల్లో బ్యాంకుపై నమ్మకం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉంది. అయితే అధికార పార్టీ నేతల ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తూ పదవీ కాలం ముగియకుండానే పదవీచ్యుతుడిని చేసేందుకు సిద్ధమవుతున్నారు.

మూడేళ్ల కాలపరిమితి ఉండగానే...

ప్రొద్దుటూరు టౌన్ బ్యాంక్ పరిధిలో ఎర్రగుంట్ల, బద్వేలు, కడప బ్రాంచ్‌లు పనిచేస్తున్నాయి. బ్యాంకుకు సంబంధించి కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయి. మొత్తం సుమారు 50 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. నిబంధనల ప్రకారం బ్యాంక్ చైర్మన్ పదవీకాలం ఐదేళ్లు. కుమార్‌రెడ్డి ఎన్నికై ఇప్పటికి రెండేళ్లు మాత్రమే పూర్తయింది. ఇంకా మూడేళ్ల పదవీకాలం ఉంది. అధికార పార్టీ ముఖ్య నేత, ఆయన వర్గీయులు మాత్రం తమ పార్టీవారే చైర్మన్‌గా కావాలని.. మీరు దిగిపోవాల్సిందేనని చైర్మన్ కుమార్‌రెడ్డిపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. వాస్తవానికి మాజీ ఎమ్మెల్యేలు ఎంవీ.రమణారెడ్డి, రాచమల్లు శివప్రసాదరెడ్డి వర్గీయులకు సంబంధించి పదిమంది డైరెక్టర్లు ఉండగా, నిన్నటివరకు అధికార పార్టీ తరపున ఇద్దరు మాత్రమే ఉన్నారు. ప్రభుత్వం మారడంతో కొంతమంది అధికార పార్టీకి అండగా నిలిచే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్‌గా చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో ప్రస్తుత చైర్మన్ కుమార్‌రెడ్డిచే రాజీనామా చేయించి కొత్త చైర్మన్‌ను ఎన్నుకుంటారని బ్యాంకు వర్గాల్లో చర్చ సాగుతోంది. మితిమీరిన రాజకీయ జోక్యంతో బ్యాంకు పరిస్థితి అగమ్యగోచరంగా మారే అవకాశం ఉందని ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు.

ఆదిశైవ అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



ఆదిశైవ బ్రాహ్మణ అర్చక సంఘం జిల్లా నూతన కమిటీ

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆదిశైవ బ్రాహ్మణ అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంఘం నూతన అధ్యక్షుడు బెల్లంకొండ కుమారస్వామి అన్నారు. ఆంధ్ర రాష్ట్రీయ ఆది శైవ బ్రాహ్మణ అర్చక సంఘం జాయింట్ సెక్రటరీ నాగరాజు శర్మ ఆధ్వర్యంలో స్థానిక రామేశ్వరంలోని భావనారాయణస్వామి ఆలయంలో సంఘం జిల్లా నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బెల్లంకొండ కుమారస్వామి, గౌరవాధ్యక్షుడిగా వీరభద్రశర్మ, రమణరావు, సుబ్రహ్మణ్యం, రాజు, ఉపాధ్యక్షులుగా తరిమెల మహేష్ శర్మ, చిన్న వీరయ్య శర్మ, దేవగుడి బద్రిశర్మ, శంకరయ్యశర్మ, ప్రధాన కార్యదర్శిగా నాగపాటి వెంకట సుబ్బయ్య శర్మ, ఉప కార్యదర్శులుగా రవిశేఖర్ శర్మ, ప్రసాద్ శర్మ, మల్లికార్జున శర్మ, టీబీఎస్ శర్మ, నాగరాజు శర్మ, కోశాధికారిగా మధు శర్మ, ఉప కోశాధికారిగా నాగేశ్వరరావు శర్మ, మహిళా సభ్యురాలిగా ముని విజయలక్ష్మిలను ఎన్నుకున్నారు.

రికార్డుల తనిఖీ

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలో జరుగుతున్న పింఛన్ పంపిణీ ప్రక్రియను రాజంపేట డివిజన్ సబ్ కలెక్టర్ వైకోమ్ నిదియా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైల్వే కోడూరు పట్టణంలోని రెండో వార్డులో పింఛన్ పంపిణీ తీరు పరిశీలించి సూచనలు చేశారు. పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యం గోదామును తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్‌ను పేదలకు సక్రమంగా అందించాలని అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేవీ.సుబ్రహ్మణ్యం, డీటీ.రెడ్డిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికకు నోటిఫికేషన్

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా 2014 ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మ్యానేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. గురువారం ఎన్నిక నోటిఫికేషన్ విడుదలతో ఘట్టం ప్రారంభమైంది. ఉదయం పది గంటలకు ఎస్ఎంసీ సభ్యులు, చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక నిర్వహణకు ప్రధానోపాధ్యాయులు నోటిఫికేషన్ విడుదల చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఓటరు జాబితా నోటీసు బోర్డులో ప్రదర్శించారు. మిగిలిన 37 పాఠశాలల్లో వివిధ కారణాలతో ఎన్నిక నిర్వహణ పక్రియ జరగలేదు. ఈ నెల 5న అభ్యంతరాల స్వీకరణ, అదేరోజున ఓటరు జాబితా విడుదల ఉంటాయి. 8న ఎన్నిక నిర్వహణ, అదే రోజు చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక, అనంతరం ప్రమాణ స్వీకరణ కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం మూడు గంటలకు సమావేశం నిర్వహిస్తారు.



ఓటరు జాబితా ప్రదర్శించిన ఖాజీపేట జడ్పీ పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు

పోలీసుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : పోలీసుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు అన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో నడుస్తున్న కల్పతరు పోలీస్ వెల్ఫేర్ స్టోర్స్, సూపర్ మార్కెట్ సందర్శించి అందులో లభించే కిరాణా, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువుల గురించి ఆరా తీశారు. నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ సిబ్బందికి అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం, పుష్పగిరి గ్యాస్ ఏజెన్సీ, పోలీస్ సంక్షేమ ఆస్పత్రి, పోలీస్ జిమ్, వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్‌ను ఆయన పరిశీలించి సూచనలు చేశారు. కిడ్స్ స్కూల్‌ను సందర్శించి చిన్నారులతో కాసేపు గడిపారు. పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. రోగులకు చికిత్స అందించేందుకు ఎలాంటి సౌకర్యాలున్నాయంటూ వైద్యురాలు డాక్టర్ మేరీ సుజాతను అడిగి తెలుసుకున్నారు. వార్డులలో ఏసీలను అమర్చాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్. సుధాకర్, ఆర్ఐ టైటస్, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

బంజరు భూమి కోసం వివాదం

చాపాడు : ప్రభుత్వ బంజరు భూమి కోసం ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. మండలంలోని వీరభద్రాపురం సమీపంలోని సర్వే నెంబర్ 311–ఎలో 1.10 ఎకరాల భూమి ఉంది. దీని పక్కనే 20 సెంట్ల ప్రభుత్వ బంజరు భూమి ఉంది. పట్టా భూమిని వీరభద్రాపురం గ్రామానికి చెందిన సురేంద్రనాథ్‌రెడ్డి నుంచి అదే గ్రామానికి చెందిన చంద్ర ఓబుళ్‌రెడ్డి కొనుగోలు చేశారు. ఈ పొలంలో గత కొన్నేళ్లుగా ఆయన వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇటీవల సురేంద్రనాథ్‌రెడ్డి, ఆయన బంధువులు వచ్చి 1.10 ఎకరాలకు మాత్రమే మీకు విక్రయించాము... మిగిలిన 20 సెంట్ల బంజరు భూమి నాది అంటూ షెడ్ వేసుకునే ప్రయత్నం చేశాడు. దీంతో వివాదం తలెత్తింది. ఇరువర్గాల ఫిర్యాదులో గత నెల 23న తహసీల్దారు ఉమారాణి ఆ స్థలానికి వచ్చి ప్రభుత్వ బంజరు భూమిగా గుర్తించి అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆదేశించారు. కాగా బుధవారం చంద్ర ఓబుళ్‌రెడ్డి తన పొలంలో వరి సాగు చేసేందుకు నారు పెట్టుకున్నారు. లక్ష్మీపేట, వీరభద్రాపురం గ్రామాలకు చెందిన బద్వేల్ సురేంద్రనాథ్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మణికంఠరెడ్డి, భూమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఉప్పలూరు మహేశ్వర్‌రెడ్డి, పల్లేటి సునీల్‌కుమార్‌రెడ్డి, ఆవూరి శ్రీధర్‌రెడ్డి ట్రాక్టర్‌లో రాళ్లను తెచ్చి నారుమడిలో పడేశారు. దీంతో చంద్ర ఓబుళ్‌రెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



నారుమడిలో రాళ్లు వేస్తున్న వ్యక్తులు

మధ్యాహ్న భోజనం చేసిన సబ్ కలెక్టర్

కలికిరి : మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలె వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాలలో మ దనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ గురువారం మధ్యాహ్న భోజనం చేశారు. కలికిరి పంచాయతీ పరిధిలోని కలికిరి–1, కలికిరి–2, కలికిరి–3, కలికిరి–4, మర్రికుంటపల్లిలో ఉద యం జరుగుతున్న పింఛన్ పంపిణీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పలువురు వృద్ధులు, వికలాంగులకు నగదు అందజేసిన ఆయన వారితో మాట్లాడారు. ఫించనుదారుల కు ఇబ్బంది కలుగకుండా ఇంటి వద్దే నగదు అందజేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం మహాత్మ జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులతో మాట్లాడి విద్యా విధానం, డిజిటల్ విద్యా బోధన, వసతి, మెనూ అమలు తదితర అంశాలను తెలుసుకున్నారు. అనంతరం ప్రార్థన చేసి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

రికార్డులు భద్రంగా ఉంచాలి

కలికిరి మండల తహసీల్దారు కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, కార్యాలయంలో ప్రైవేటు సిబ్బందిని నియమించుకోరాదని సూచించారు. ప్రతి కార్యాలయ పని వేళల అనంతరం వాచ్‌మెన్‌గా వీఆర్ఏను ఏర్పాటుచేసుకోవాలన్నారు. అదనపు వేళలు పనిచేయాల్సి వస్తే రావడానికి తప్పనిసరిగా తహశీల్దారు అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీ సయ్యద్‌అహ్మద్, సిబ్బంది దేవి, హుస్సేన్ పీరన్, పుష్పలత, వీఆర్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో సహపంక్తి భోజనానికి ముందు ప్రార్థన చేస్తున్న సబ్ కలెక్టర్, విద్యార్థినులు

గంజాయి స్థావరాలపై దాడులు



గంజాయి విక్రయదారు, గంజాయిని చూపుతున్న ఇన్‌ఛార్జి సీఐ శంకర్‌నాయక్

కడప అర్బన్ : గంజాయి విక్రయ స్థావరాలపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పర్యవేక్షణలో డిస్ట్రిక్ట్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ (డి.ఎన్.సి.సి) ఆధ్వర్యంలో ఈ దాడులు కొనసాగుతున్నాయి. కడప ఇన్‌ఛార్జి డీఎస్పీ ఎన్.సుధాకర్ ఆధ్వర్యంలో సీఐ కె.రామచంద్ర, ఎస్ఐ వి.నారాయణ, సిబ్బంది చలమారెడ్డిపల్లె సర్కిల్ వద్ద ఖాజీపేట మండలం భూమాయపల్లెకు చెందిన సాగిలి బాలకొండారెడ్డి అలియాస్ కొండారెడ్డిని అరెస్ట్ చేసి అతడి వద్ద రూ.10వేల విలువైన 2.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌస్ నగర్‌లో ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న షేక్ మహమ్మద్ అజారుద్దీన్ అలియాస్ అజ్జు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి వద్ద 1.75 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో ఎస్ఐ సంజీవరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

రాయచోటి టౌన్ : జర్నలిస్టుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రీతం రెసిడెన్సీలో గురువారం జరిగిన ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు ఇప్పించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. అనంతరం అన్నమయ్య జిల్లా ప్రింట్ మీడియా కమిటీలను రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ప్రింట్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా గొనిపల్లె శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా వంశీధర్, కోశాధికారిగా రామచంద్ర, గౌరవాధ్యక్షుడిగా వెంకటకృష్ణయ్య, గౌరవ సలహాదారుడిగా రెడ్డెయ్యరాజులను ఎన్నుకున్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా చెన్నూరు శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడిగా రమేష్‌బాబు, కార్యదర్శిగా రవిప్రకాష్‌రాజు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, అహమ్మద్‌బాషా, అస్లాం, జానకిరామ్, శేఖర్ ఎంపికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఆదినారాయణ, మణికంఠ, ఆర్గనైజింగ్ సెక్రటరిగా బీటెక్ రవి, కోశాధికారిగా రెడ్డి ప్రసాద్ ఎన్నికయ్యారు.

ప్రతి కార్డుదారుడికి నిత్యావసరాల పంపిణీ

– జేసీ ఆదర్శ రాజేంద్రన్

పీలేరు : జిల్లా వ్యాప్తంగా ప్రతి బియ్యం కార్డుదారుడికి ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దే నిత్యావసర సరకులు అందించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆదేశించారు. మండలంలోని పీలేరు పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో చౌక బియ్యం సరఫరాను గురువారం ఆమె తనిఖీ చేశారు. కార్డుదారులకు అందిస్తున్న ధరను అడిగి తెలుసుకొన్నారు. తూకాలలో తక్కువ వచ్చినా, అధిక మొత్తం తీసుకున్నా ఎండీయూ వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఉదయం–సాయంత్రం గ్రామస్తులు అందుబాటులో ఉన్న సమయంలో సరకులు అందించాలని సూచించారు.

బాకీ తీర్చలేదని నేతన్నపై దాడి



గాయపడిన నాగేంద్ర

మదనపల్లె : బాకీ తీర్చలేదని నేతన్నపై మగ్గాల యజమాని దాడికి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని బయా రెడ్డి కాలనీలో నాగేంద్ర(46).. నీరుగట్టుపల్లెకు చెందిన మగ్గాల యజమాని రాజారెడ్డి దగ్గర చేనేత కార్మికుడిగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఇంటి అవస రాల కోసం నాగేంద్ర కొంత నగదును యజమాని వద్ద అప్పుగా తీసుకున్నా రు. కొంతకాలంగా బాకీ చెల్లించకపో గా, మరో చోట పనులకు వెళ్లాడు. దీంతో బుధవారం రాత్రి నీరుగట్టుపల్లెలోని రింగు రోడ్డు వద్ద ఉన్న నాగేంద్రను కలి సి బాకీ చెల్లించాలి.. లేదా పనిచేయాలంటూ వివాదానికి దిగారు. ఇద్దరి మధ్య వాగ్వాదం పెరగడంతో రాజారెడ్డి, తన కుటుంబ సభ్యులతో కలిసి నాగేంద్రపై దాడికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు బాధితుడిని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

8 నుంచి ఒంటిమిట్ట గర్భాలయం మూసివేత

ఒంటిమిట్ట : కోదండ రామాలయంలోని మూల విరాట్ సీతారామ లక్ష్మణుల గర్భాలయాన్ని సెప్టెంబర్ 8వ తేదీ నుంచి రెండు నెలలపాటు మూసి వేస్తున్నట్లు టీటీడీ ఆగమ అర్చకులు రాజేష్ బట్టర్ తెలిపారు. సెప్టెంబర్ 6న అంకురార్పణతో స్వామికి బాలాయనం కైంకర్యాలు వేదపండితులు నిర్వహించి మూలవిరాట్‌లోని శక్తి సామార్థ్యాలను ఉత్సవ విగ్రహాల్లోకి అనువదించడం శాస్త్రీయంగా చేపడతారు. పురావస్తు ఆధ్యాత్మిక వారసత్వ సంపదను భావితరాలకు అందించేందుకు పురావస్తు శాఖ, టీటీడీ ఆధ్వర్యంలో తీసుకున్న ఈ నిర్ణయానికి భక్తులందరూ సహకరించాలని కోరారు.

మరమ్మతులకు అనుమతులు మంజూరు

ఆంధ్ర అయోధ్యంగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయ విమాన గోపురానికి మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. పురావస్తుశాఖ రాష్ట్ర అధికారి బాలకృష్ణా రెడ్డి, టీటీడీ ఇంజినీరింగ్ ఈఈ సుమతి, స్పెషల్ ఆఫీసర్ ప్రశాంతి, డిప్యూటీ ఈవో నటేష్ బాబు ఆలయంలో చేపట్టాల్సిన పనులను క్షేత్ర స్థాయిలో గురువారం పరిశీలించారు. అనంతరం టీటీడీ గెస్ట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలయంలో భావితరాలకు ఉపయోగపడే విధంగా విమాన గోపురానికి మరమ్మతులు చేపట్టాలని, నల్లరాతి బండలు తొలగించి ఆలయాన్ని సుందరీకరించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈ వెంకటరత్నం, ఏఈ నందిబాబు, ఇంజినీరింగ్ ఏఈ అమర్నాథరెడ్డి, హనుమంతయ్య, నవీన్, వీణ రాఘవాచార్యులు, పవన్ కుమార్, శ్రావణ్ కుమార్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



కోదండ రామాలయాన్ని పరిశీలిస్తున్న పురావస్తుశాఖ అధికారులు

పింఛన్ పంపిణీ పరిశీలన

చిన్నమండెం : మండల కేంద్రంలో జరుగుతున్న పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి రమణారెడ్డి గురువారం పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్ పంపిణీ ప్రారంభించారు. సీఈవో రమణారెడ్డి చిన్నమండెం, మల్లూరు గ్రామాల్లో సిబ్బంది పింఛన్ పంపిణీ తీరును తనిఖీ చేశారు. దాదాపు 96 శాతం పూర్తిచేశామని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు.

అండర్–19 టోర్నీలో బౌలర్ల హవా



సుశాంత్(88 పరుగులు)



రక్షణ్ (87 పరుగులు)



పూర్ణచంద్ర(5 వికెట్లు)



గీత్ (5 వికెట్లు)



రాజేష్(5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో బౌలర్ల హవా నడుస్తోంది. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో గురువారం నెల్లూరు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 51.3 ఓవర్లలో 190 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని చరణ్‌జీత్ 45, ప్రణవ్ కృష్ణ 35 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు పూర్ణ గణేష్ 5 వికెట్లు, హమీద్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. జట్టులోని ప్రణవ్ కార్తీక్ 55, అర్జున్ 42 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు సాయిచరణ్ 2, బాలాజీ 2 వికెట్లు తీశారు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కృష్ణా, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన పశ్చిమగోదావరి జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 87 ఓవర్లలో 281 పరుగుల వద్ద పశ్చిమ గోదావరి జట్టు ఆలౌట్ అయింది.

జట్టులోని రక్షణ్ 87 పరుగులు, రేవంత్ 68 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్లు రాజేష్ 5 వికెట్లు, గీత్ 5 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 16 పరుగులు చేసింది. జట్టులోని ధనుష్ 8, భవానీ 6 పరుగులతో క్రీజులో ఉన్నారు.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్ లో శ్రీకాకుళం, విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీకాకుళం జట్టు 66.2 ఓవర్లలో 212 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సుశాంత్ 88 పరుగులు, కల్యాణ్ కుమార్ 72 పరుగులు చేశారు. విశాఖ బౌలర్లు యువన్ 3, రచిత్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 23 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 82 పరుగులు చేసింది. జట్టులోని ఈశ్వర్ 43 పరుగులు, యశ్వంత్ 20 పరుగులతో క్రీజులో ఉన్నారు.

సెల్ టవర్ వద్ద గుర్తు తెలియని మృతదేహం



పుల్లంపేట : మండలంలోని అనంతయ్యగారిపల్లిలోని సెల్ టవర్ వద్ద గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి 35 సంవత్సరాల వయస్సు ఉందని, బ్లూ కలర్ నైట్ ప్యాంట్, నలుపు రంగు షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. బంధువులు, స్నేహితులు మృతదేహాన్ని గుర్తించినచో 9121100572ను సంప్రదించాలని పుల్లంపేట పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

పెద్దతిప్పసముద్రం : తన భార్య రెండు రోజుల క్రితం అదృశ్యమైనట్లు మండలం లోని వడ్డిపల్లికి చెందిన ముత్తన మహేష్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 30న వ్యవసాయపొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి రావడంతో తన భార్య కనబడకుండా పోయిందన్నారు. అప్పటినుంచి తాము పలు చోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.